# మన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

## టిఆర్‌సి చర్చలో వక్తలు

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం-పాఠశాల విద్యలో చరిత్ర పాఠాలు అనే అంశంపై 142వ చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తల ప్రసంగ సారాంశం క్లుప్తంగా...

చరిత్ర అంటే గతంలో జరిగిన విషయాలు, వాటి ఆధారాలు విశ్లేషించి, వర్తమాన కాలానికి అన్వయించుకోవడం, భవిష్యత్తు తరాలకు అనుభవాలు అందించడం చరిత్ర ఉద్దేశం. రేపటి పౌరులకు గతం తెలుసుకోవడంతో పాటు వీటిని విశ్లేషించుకొని నిత్యజీవితంలో ప్రతి సందర్భంలో విశ్లేషించుకోవడానికి ఉపయోగపడుతుంది. అది చరిత్ర. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సమాజం రెండవ తరగతి పౌరులుగా ఉండడం, ఈ ప్రాంత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చకుండా కేవలం ఒక ప్రాంత చరిత్రను తెలంగాణ ప్రాంతంపై రుద్దిన చరిత్ర మనకు ఇక్కడ ఉన్నది.

మొత్తం తెలంగాణ సమాజం దీక్ష, పట్టుదలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అదే పట్టుదలతో విద్యావ్యవస్థను కాపాడుకోవాలి. రెండున్నర జిల్లాల, రెండు కులాల భాషే ప్రామాణిక భాషగా రూపుదిద్దుకున్న పరిస్థితుల్లో తెలంగాణ భాషను హాస్యపు భాషగా ప్రచారం చేసిన వ్యవస్థ నుంచి, వివక్షకు గురైన మనం సాయుధ పోరాట చరిత్ర, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తుల చరిత్ర, పోరాట సంఘటనలు పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చాలి. ప్రాచీన చరిత్ర నుంచి ఇప్పటి వరకు ఉన్న ప్రతి సంఘటనను పాఠ్యాంశాలుగా చేర్చాలి లేకపోతే మళ్ళీ మనం మన చరిత్రను నిర్మించుకోలేం. తెలంగాణ ప్రాంత కరువు గురించి, గొలుసు చెరువులను గురించి, ఇక్కడి పండుగలు, సంస్కృతిని గురించి చెప్పడం చాలా ముఖ్యం. విభిన్న దృక్పథాలు చేర్చడం చాలా అవసరం. కేవలం పాఠాలు చెప్పడం కాదు, వాటి నేపథ్యం కూడా చెప్పడం అవసరం. ఈ పాఠ్యాంశాలు విద్యార్థికి ప్రశ్నించడాన్ని నేర్పేలా ఉండాలి.

ప్రపంచీకరణ నేపథ్యంలో మొత్తం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూసివేయబడుతున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉండడం లేదు. ఈ పరిస్థితికి కారణాలు అన్వేషించి పరిస్థితులు మార్చుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యను వెంటనే అమలు చేసుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉండేలా చూసుకోవాలి.

పండుగల విషయానికి వస్తే, తెలంగాణలో అత్యంత పెద్ద పండుగలైన బతుకమ్మ, దసరా, సమ్మక్క- సారలమ్మ జాతర లాంటి వాటి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. మార్క్స్ చెప్పినట్లు ఉత్పత్తి శక్తులైన ప్రజల చరిత్ర నిర్మించాలి, చక్రవర్తుల చరిత్ర కాదు. పాలితుల జీవితాలను చరిత్ర వివరించాలి. శ్రీశ్రీ చెప్పినట్లు తేదీలు, సంఘటనలు, ప్రేమ పురాణాలు చరిత్ర కాదు. కావాల్సింది ప్రజల చరిత్ర. ఆ చరిత్రను మనం ప్రజల ముందుకు తీసుకెళ్ళాలని వక్తలు అన్నారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పి.సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, జూపాక సుభద్ర, బి.భుజంగరావు, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, డి.మల్లారెడ్డి, టీఆర్‌సీ చైర్మన్ యం.వేదకుమార్, రాజమహేంద్ర రెడ్డి, జితేందర్, పిట్టల శ్రీశైలం, కృష్ణ, హరిత్, పూజారి నర్సింగ్‌రావు, చల్ల కృష్ణారెడ్డి, వెంకటేష్, జనార్ధన్, ఆదినారాయణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బోనకుర్తి సోమేశ్వర్
కో-ఆర్డినేటర్
తెలంగాణ రిసోర్స్ సెంటర్